సాక్షి జోగులాంబ గద్వాల

మంగళవారం । 13 । ఫిబ్రవరి । 2024

గరిష్ఠం/కనిష్ఠం
37.2 /17.0

వాతావరణం
కొంత మేర మేఘాలు ఉంటాయి. తేమ ఎక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

అక్షరాస్యతలో జిల్లాను అగ్రగామిగా నిలపాలి



గద్వాల: ప్రభుత్వ ఉపాధ్యాయ సంఘం (జీటీఏ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను డీఈఓ ఇందిర ఆవిష్కరించారు. సోమవారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని జీటీఏ ఉపాధ్యాయ సంఘం క్యాలెండర్‌తో పాటు డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. అక్షరాస్యతలో జిల్లాను అగ్రగామిగా నిలపాలన్నారు. విద్యా అభివృద్ధిలో ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అంకిత భావంతో విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని కోరారు. కార్యక్రమంలో జీటీఏ జిల్లా అధ్యక్షుడు కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి నర్సింహులు, నాయకులు జహురుద్దీన్, సవారన్న, ఇమ్మానియేల్, వెంకటనర్సయ్య, శోభరాణి, విష్ణు, శ్రీధర్ పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు

అలంపూర్: రోడ్డు భద్రతా నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని అప్పుడే సురక్షితంగా గమ్యం చేరతారని, ఎట్టి పరిస్థితుల్లో మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అలా నడిపితే చర్యలు తప్పవని ఎస్పీ రితిరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారించడానికి పోలీస్ శాఖ న్యాయ శాఖతో సమన్వయం చేసుకుంటూ పని చేస్తోందని, అందులో భాగంగానే డ్రంక్ అండ్ డ్రైవ్, విత్ ఔట్ హెల్మెట్, మైనర్ డ్రైవింగ్, ఓవర్ స్పీడ్, ఇతర ఉల్లంఘనలపై నిత్యం తనిఖీలు చేపట్టి జరిమానాలు విధించడం జరుగుతుందని పేర్కొన్నారు. మద్యం తాగి నడపడం వల్ల ఎదుట వచ్చే వారికి కూడా ప్రమాదం పొంచి ఉంటుందని, రోడ్డు ప్రమాదాల్లో కుటుంబ పెద్ద మృతిచెందితే ఆ కుటుంబం రోడ్డున పడాల్సి వస్తోందని పేర్కొన్నారు.

8మందికి జైలు శిక్ష, 12మందికి జరిమానా

తాజాగా డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన 20మందిపై కేసులు నమోదు చేసి సోమవారం స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి కమలాపురం కవిత ఎనిమిది మందికి జైలు శిక్ష, మరో 12మందికి జరిమానా విధించినట్లు ఎస్పీ, ఎస్ఐ నాగరాజు తెలిపారు. అలంపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో మద్యం సేవించి వాహనాలు నడపడంతో పట్టుకొని డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని, ఎనిమిది మందికి ఒక్కొక్కరికి రూ.2వేల జరిమానా, రెండు నుంచి నాలుగు రోజుల జైలు శిక్ష విధించారని, మిగా 12 మందికి రూ.2వేల చొప్పున జరిమానా విధించారని తెలిపారు.

మార్మోగిన శివనామస్మరణ



అయిజ: పట్టణం శివనామస్మరణతో మార్మోగింది. అయిజలో పునర్నిర్మించిన శివాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ట పూజలు నిర్వహించగా మంత్రాలయ పీఠాధిపతి సుబుదేంద్ర తీర్థులు హాజరయ్యారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీరాముడు వనవాసం చేస్తున్న సమయంలో సీతమ్మవారితో కలిసి అయిజలో ప్రతిష్టించిన శివలింగాలు చరిత్రకు సాక్షాలని, అయిజకు యుగయుగాల చరిత్ర ఉందని అన్నారు. పరమశివుడు ఇక్కడి భక్తులను దీవిస్తూ, అందరి కష్టాలను పరిహారం చేస్తుండడం వలన అయిజ దివ్యక్షేత్రంగా పేరు ప్రఖ్యాతులు గాంచిందని అన్నారు. కాల క్రమంగా శిథిలమవుతున్నటువంటి ఆలయాన్ని భక్తులు పునర్నిర్మించడం హర్షనీయమన్నారు. హిందూ ధర్మాన్ని చాటి చెప్పే విధంగా ఆలయాన్ని నిర్మించడం విశేషం అన్నారు. దక్షిణ భారత దేశంలో సముద్ర తీరాల్లో ఉన్నటువంటి రామేశ్వరం తదితర పుణ్య స్థలాలతోపాటు మంత్రాలయం, గురుజాల, అయిజలో శ్రీరాముడు శివలింగాలను ప్రతిష్టించాడని పేర్కొన్నారు. ఎక్కడైతే శివలింగానికి పూజలు నిర్వహిస్తారో ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందని పీఠాధిపతులు అన్నారు.

వేరుశనగ క్వింటా రూ.6,610

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు సోమవారం 1916 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ.6610, కనిష్ఠం రూ.4229, సరాసరి రూ.5006 ధరలు పలికాయి. అలాగే, 33 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్ఠం రూ.5520, కనిష్ఠం రూ. 5350, సరాసరి రూ. 5492 ధరలు వచ్చాయి. 79 క్వింటాళ్ల కంది రాగా గరిష్ఠం రూ. 10,066, కనిష్ఠం రూ. 4000, సరాసరి రూ. 9910 ధరలు పలికాయి.

నీలినీడలు..!

రెండో విడత గొర్రెల పంపిణీపై వీడని సందిగ్ధం



గద్వాల శివారులో సబ్సిడీపై అందించిన గొర్రెలు (ఫైల్)

- వాటా నగదు చెల్లించి ఏళ్లు గడుస్తున్నా అందని గొర్రెలు
- ఆర్థిక ఇబ్బందుల్లో పెంపకందారులు
- డబ్బులైనా ఇవ్వండి.. గొర్రెలైనా పంపిణీ చేయాలని వేడుకోలు

గద్వాల వ్యవసాయం: గడిచిన టీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన గొర్రెల పెంపకందారుల అభివృద్ధి పథకంపై నీలినీడలు కమ్ముకున్నాయి. లిస్ట్–బీ కింద గొర్రెల పంపిణీకి తమ వాటా కింద డబ్బులు చెల్లించి, నెలలు గడుస్తున్నా ఇంత వరకు తమకు గొర్రెలు పంపిణీ చేయలేదని పెంపకందారులు వాపోతున్నారు. అటు డబ్బులైన చెల్లించాలని.. లేదా.. గొర్రెలైన పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈపథకాన్ని కొనసాగిస్తుందా... తీసివేస్తుందా అన్న ప్రశ్న కూడా పెంపకందారులకు కల్గుతోంది.

సబ్సిడీ పథకం

గొర్రెల పెంపకందారులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2017 జూన్ 20న ఈ పథకాన్ని తీసుకొచ్చింది. పెంపకందారులకు సబ్సిడీపై గొర్రెలు అందించి, వారిని ఆర్థికంగా బలోపేతం చేయడం ఈ స్కీం ముఖ్య ఉద్దేశం. పథకంలో భాగంగా అప్పట్లో డిప్‌ద్వార మొదటి విడత (లిస్ట్–ఏ), రెండోవిడత (లిస్ట్–బీ) లబ్ధిదారులను ఎంపిక చేశారు. 2017–18లో లిస్ట్–ఏ లబ్ధిదారులకు గొర్రెలను పంపిణీ చేశారు. ఒక్కో యూనిట్‌లో ఒక పొటేలు, 20గొర్రెలు ఉండేలా పథకాన్ని రూపొందించారు. అప్పుడు ఒక్కో యూనిట్‌కు రూ.1.25లక్షలు ఖర్చు చేశారు. ఇందులో లబ్ధిదారుడు 25శాతం చెల్లించగా, మిగిలిన 75శాతం ప్రభుత్వం సబ్సిడీపై అందించింది.

జిల్లా వివరాలిలా..

గొర్రెల పెంపకందారుల సహకార సంఘాలు 206	మొదటి విడత పంపిణీ లక్ష్యం 13,156 యూనిట్లు
పంపిణీ చేసింది 13,156 యూనిట్లు	
రెండోవిడత పంపిణీ లక్ష్యం 9,142 యూనిట్లు	వాటాధనం చెల్లించిన పెంపకదారులు 2,280 మంది
పంపిణీ అయిన వారి సంఖ్య 510	వాటాధనం చెల్లించి పంపిణీ కాని వారి సంఖ్య: 1770

రెండో విడత పంపిణీకి అడ్డంకులు

నాలుగేళ్ల తర్వాత రెండోవిడత పంపిణీకి అనేకం అడ్డువచ్చాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చాక ఈ పథకానికి నిధులు కేటాయించలేదు. దీనికితోడు కరోనా వ్యాధి వ్యాప్తి అయి, లాక్‌డౌన్ విధించారు. దీంతో రెండోవిడత లబ్ధిదారులు దాదాపు నాలుగేళ్లు ఎదురు చూశారు. ఎట్టకేలకు గడిచిన 2023 మే నెలలో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం రెండోవిడత గొర్రెలు పంపిణీ చేస్తామని ప్రకటించింది. మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా యూనిట్ విలువను రూ.1.25లక్షల నుంచి రూ.1.75లక్షలకు పెంచింది. లబ్ధిదారుడు తన వాటా సొమ్మును డీడీ రూపంలో కాకుండా, ఆయా కలెక్టర్‌ల ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయాలని సూచించింది.

పథకం కొనసాగేనా..?

ఎన్నికల నోటిఫికేషన్ రావడం, ఎన్నికలు, ఆతర్వాత ప్రభుత్వం మారడం జరిగిపోయాయి. అయితే డబ్బు చెల్లించిన పెంపకందారులకు మాత్రం గొర్రెల పంపిణీ జరగలేదు. తాము డబ్బు చెల్లించి, ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇంతవరకు తమకు గొర్రెలు పంపిణీ చేయలేదని, లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి తమ వాటా సొమ్మును చెల్లించామని, తాము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. తమకు డబ్బు అయిన వాపసు ఇవ్వాలని లేదా, గొర్రెలైనా పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు చుట్టూ పలుమార్లు తిరిగామని, తమ చేతుల్లో ఏమి లేదని, కొత్త ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని చెబుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు కొత్త ప్రభుత్వం ఈపథకాన్ని కొనసాగిస్తుందా లేదా అన్న ప్రశ్న పెంపకందారులను వేదిస్తోంది.

డబ్బులు చెల్లించిన పెంపకందారులు

జిల్లాలో లిస్ట్–బీ కింద ఉన్న లబ్ధిదారులు ప్రభుత్వ ప్రకటనతో ఊరట చెందారు. తమకు గొర్రెలు పంపిణీ చేస్తారని సంతోషించారు. ఈక్రమంలో అధికారుల సూచన మేరకు పెంపకందారులు జిల్లా కలెక్టర్ ఖాతాకు తమ వాటా కింద ఒక్కొక్కరు రూ. 43,750 ట్రాన్స్‌ఫర్ చేశారు. ఇదంతా 2023 జూన్, జులైలో జరిగింది. అయితే డబ్బు చెలించిన వారందరికి గొర్రెల పంపిణీ జరగలేదు. ప్రభుత్వం కెటాయించిన బడ్జెట్ మేరకు ఇక్కడి అధికారులు పెంపకందారులకు గొర్రెలు పంపిణీ చేశారు. చాలామందికి చేయలేకపోయారు.

అధికారుల చుట్టూ తిరుగుతున్నాం



రెండోవిడత గొర్రెల పంపిణీలో భాగంగా గడిచిన జూన్‌లో డబ్బు చెల్లించాను. ఇంతవరకు గొర్రెలు ఇవ్వలేదు. అధికారులను చాలా సార్లు కలిశాం. ప్రభుత్వం నుంచి ఇంకా ఎలాంటి ఆదేశాలు రాలేదని చెబుతున్నారు. – గోపాల్, నారాయణపురం, మానవపాడు మండలం

డబ్బులు వాపస్ ఇప్పించండి



గొర్రెల కోసం అప్పు చేసి డబ్బు కట్టాను. నెలలు గడుస్తున్నా గొర్రెలు పంపిణీ చేయలేదు. మేం చెల్లించిన డబ్బులు వాపసు ఇవ్వాలని లేదా లేదా గొర్రెలైనా పంపణీ చేయాలని అధికారులను చాలా సార్లు అడిగాను. – వెంకటేశ్వర్లు, నారాయణపురం, మానవపాడు మండలం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లా



రెండోవిడత గొర్రెల పంపిణీలో భాగంగా కలెక్టర్ ఖాతాకు కొందరు పెంపకందారులు డబ్బు చెల్లించారు. ఈ సమస్యపై కలెక్టర్ ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లాం. ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. – వెంకటేశ్వర్లు, జిల్లా పశువైద్య, పశుసంవర్ధక శాఖ అధికారి

ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచొద్దు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై పెండింగ్‌లో ఉంచకుండా పరిష్కరించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 150ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. ఇందులో భూసంబంధ, పింఛను, సమస్యలపై వచ్చాయని, వీటిని ఆయా శాఖలకు చెందిన అధికారులు పంపినట్లు తెలిపారు. పరిష్కారం కాని పక్షంలో అందుకు గల కారణాన్ని పేర్కొంటూ సంబంధిత ఫిర్యాదుదారునికి అక్నాలెడ్జ్‌మెంట్ పంపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల తనిఖీ

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలకు సంబంధించి మొదటి స్థాయి తనిఖీలు నిర్వహించినట్లు అదనపు కలెక్టర్ అపూర్వ్‌చౌహాన్ తెలిపారు. సోమవారం స్థానిక పీజేపీ క్యాంపులోని స్ట్రాంగ్‌రూంలో ఈవీఎం, వీవీప్యాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో 826ఈవీఎం బ్యాలెట్ యూనిట్లు, 769కంట్రోల్ యూనిట్లు, 930 వీవీ ప్యాట్ల తనిఖీల ప్రక్రియ నిర్వహించనున్నట్లు తెలిపారు. తనిఖీలను ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందాల సమక్షంలో నిర్వహించినట్లు తెలిపారు. ఈప్రక్రియ అనంతరం గుర్తింపు పొందిన వివిధ రాజకీయపార్టీల సమక్షంలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల పనితీరును ప్రయోగాత్మకంగా ర్యాండం విధానంలో మాక్‌పోలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్లు, సిబ్బంది పాల్గొన్నారు.

డీఐజీగా ఎల్ఎస్ చౌహాన్ కొనసాగింపు



మహబూబ్‌నగర్ క్రైం: జోగుళాంబ జోన్–7 డీఐజీగా ఎల్ఎస్ చౌహాన్‌ను తిరిగే అదే పోస్టింగ్‌లో కొనసాగిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు. గతేడాదిలో జోగుళాంబ జోన్–7 నూతనంగా ఏర్పాటు చేసిన తర్వాత మొదటి పోస్టింగ్‌లో ఎల్ఎస్ చౌహాన్‌కు పోస్టింగ్ ఇచ్చారు. ఆయన డీఐజీగా ఉమ్మడి జిల్లాలో ఏడాది కాలం పూర్తిచేశారు. అయితే జనవరి 3న డీఐజీ ఎల్ఎస్ చౌహాన్‌ను రామగుండం కమిషనర్‌గా బదిలీ చేసి.. ఆయన స్థానంలో జోయల్ డేవిస్‌ను కేటాయించారు. కానీ, నూతన డీఐజీ విధుల్లో చేరకపోగా.. ఎల్ఎస్ చౌహాన్ సైతం రిలీవ్ కాలేదు. తాజాగా ఎల్ఎస్ చౌహాన్‌నే డీఐజీగా కొనసాగిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలి

గద్వాల: ప్రతి క్రీడాకారుడికి క్రీడాస్ఫూర్తి ముఖ్యమని.. దీని వల్లే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని జెడ్పీ చైర్‌పర్సన్ సరిత అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక స్టేడియంలో నిర్వహించిన రాజీవ్‌గాంధీ స్మారక ఇన్విటేషన్ క్రికెట్ టోర్నీకి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. క్రీడలను ప్రోత్సహించాలనే తలంపుతో కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో రూ.200 కోట్ల వ్యయంతో ప్రతి నియోజకవర్గంలో ఇండోర్ స్టేడియాలను నిర్మించిందన్నారు. గద్వాలలో రూ.2 కోట్ల వ్యయంతో మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం చేపట్టిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రతి క్రీడాకారుడు జాతీయస్థాయి పోటీలను లక్ష్యంగా నిర్దేశించుకొని ఆడాలని సూచించారు. గద్వాలను సాగునీటి పరంగా, విద్యాపరంగా, క్రీడల పరంగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు.

నడిగడ్డను క్రీడలకు కేంద్రాం తీర్చిదిద్దుతాం

ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ మాట్లాడుతూ నడిగడ్డ ప్రాంతాన్ని క్రీడాకేంద్రంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామన్నారు. ప్రతి క్రీడాకారుడు క్రీడాస్ఫూర్తి ప్రదర్శించాలని సూచించారు. చదువుతోపాటు క్రీడలలోనూ రాణించాలని సూచించారు. అంతకు ముందు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్రీడాకారులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించగా.. అతిథులు గౌరవ వందనం స్వీకరించారు. శాంతి కపోతాలను వదలి టోర్నీని లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతయ్య, బండారి బాస్కర్, బండ్ల రాజశేఖర్‌రెడ్డి, నల్లారెడ్డి, శంకర్, మధుసూదన్ బాబు, కౌన్సిలర్ అనిత పాల్గొన్నారు.



శాంతి కపోతాలను వదులుతున్న జెడ్పీచైర్‌పర్సన్ సరిత, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్

రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు విద్యార్థులు



పోటీలలో గెలుపొందిన విద్యార్థులతో విద్యాశాఖ అధికారులు

గద్వాల: రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలకు జిల్లా నుంచి 12 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక బాలభవన్‌లో విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించారు. ఆయా విభాగాలలో ప్రతిభ చాటిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. గెలుపొందిన విద్యార్థులకు డీఈఓ ఇందిర ప్రశంసా పత్రాలను అందజేశారు.

విజేతలు వీరే... పెయింటింగ్ విభాగంలో శివాని, రక్షిత, వైష్ణవి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానంలో నిలిచారు.అలాగే, కవిత్వం విభాగంలో ప్రవీణ్, ఉమ, భీమరాజు, పాటల పోటీలలో సుప్రియ, శివ, గాయత్రి, ఉపన్యాస పోటీలలో కేశవర్ధన్, రూప, ఆదికేశవ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు నిలిచారు.కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి బాస్కర్ పాపన్న, ఎస్‌జీసీ కోఆర్డినేటర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో భారీగా బదిలీలు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలలో పెద్దఎత్తున జిల్లా అధికారుల బదిలీలు అయ్యాయి. గతంలో ఎప్పుడూ లేనంతంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈ శాఖల్లో అధికారులు బదిలీ కావడం గమనార్హం. సాధారణ ఎన్నికల్లో ముఖ్యంగా రెవెన్యూ, పీఆర్‌లో ఎంపీడీఓల బదిలీలు అయ్యేవి. కానీ, లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సోమవారం పంచాయతీరాజ్ శాఖలో పనిచేస్తున్న జిల్లా, డివిజన్ స్థాయి అధికారులను బదిలీ చేస్తూ ఆయా శాఖల ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

■ మహబూబ్‌నగర్ జెడ్పీ సీఈఓ జ్యోతి సంగారెడ్డి సీఈఓగా వెళ్లగా ఇక్కడికి ఈటీసీలో ఉన్న బి.రాఘవేంద్రరావు వచ్చారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జెడ్పీ సీఈఓ దేవసహనం నాగర్‌కర్నూల్ జిల్లాకు, నాగర్‌కర్నూల్ జెడ్పీసీఈఓ ఉష నిజామాబాద్‌కు బదిలీపై వెళ్లారు. అలాగే మహబూబ్‌నగర్ డీఆర్‌డీఓ యాదయ్య వనపర్తి జెడ్పీసీఈఓగా, నాగర్‌కర్నూల్ డీఆర్‌డీఓ నర్సింగ్‌రావు గద్వాలకు, నారాయణపేట జెడ్పీ సీఈఓ గోపాల్ నాగర్‌కర్నూల్ డిప్యూటీ సీఈఓగా, వనపర్తి జెడ్పీసీఈఓ నర్సింహులు మహబూబ్‌నగర్ డీఆర్‌డీఓగా వచ్చారు. గద్వాల డిప్యూటీ సీఈఓ ముషాహిదాబేగం మహబూబ్‌నగర్ అదనపు డీఆర్‌డీఓగా నియామకం అయ్యారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న డీఎస్‌వీ శర్మ మహబూబ్‌నగర్ జెడ్పీ డిప్యూటీ సీఈఓగా, వనపర్తి అదనపు డీఆర్‌డీఓ నాగేంద్ర భద్రాద్రి కొత్తగూడెంకు బదిలీపై వెళ్లా రు. నాగర్‌కర్నూల్ అదనపు డీఆర్‌డీఓ రాజేశ్వరి నారాయణపేట డీఆర్‌డీఓగా, గద్వాల డీపీఓ శ్యాంసుందర్ నారాయణపేటకు, నారాయణపేట డీపీఓ మురళిని నల్లగొండకు, గద్వాల డీపీఓగా శ్రీనివాస్‌రెడ్డి రంగారెడ్డి నుంచి వచ్చారు. వనపర్తి డీపీఓ సురేష్ కుమార్ సూర్యాపేటకు వెళ్లారు. మహబూబ్‌నగర్ డీఎల్‌పీఓ వరలక్ష్మి నాగర్‌కర్నూల్‌కు డీఎల్‌పీఓ, కల్వకుర్తి డీఎల్‌పీఓ పండరినాథ్ మహబూబ్‌నగర్ డీఎల్‌పీఓగా బదిలీపై వచ్చారు.

ఎక్సైజ్ శాఖలో సైతం..

మహబూబ్‌నగర్ క్రైం: రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్లను బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. మహబూబ్‌నగర్ ఈఎస్‌గా పనిచేస్తున్న సైదులును యాదాద్రి భువనగిరి జిల్లా ఈఎస్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో జిల్లాకు కొత్త ఈఎస్‌ను ఎవరినీ కేటాయించలేదు. అలాగే నాగర్‌కర్నూల్ ఈఎస్ ఫయాజుద్దీన్‌ను మేడ్చల్ ఈఎస్‌గా బదిలీ కాగా.. సంగారెడ్డి ఈఎస్ డి.గాయత్రి నాగర్‌కర్నూల్‌కు, మల్కాజిగిరి ఈఎస్ డి.అరుణ్‌కుమార్‌ను గద్వాలకు, సరూర్‌నగర్ ఈఎస్ టి.రవీందర్‌రావును వనపర్తి లిక్కర్ డిపోకు బదిలీ చేశారు.

సీఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పటేల్ బానోతు	డీటీఎఫ్ గద్వాల	ఎస్‌హెచ్‌ఓ అమీర్‌పేట్
జి.గోపాల్	ఎస్‌హెచ్‌ఓ గద్వాల	దూల్‌పేట్–2
బి.ఓంకార్	కొత్తకోట	ఉప్పల్
కె.బాలకృష్ణారెడ్డి	పెబ్బేర్	ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎంబీఎన్‌ఆర్
జి.కల్యాణ్	సీపీ– కృష్ణ	నాగర్‌కర్నూల్
బి.నాగిరెడ్డి	భువనగిరి	కొల్లాపూర్
కె.రమణయ్య	ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎంబీఎన్‌ఆర్	తెలకపల్లి
ఎం.శంకర్	కల్వకుర్తి	కోదాడ
ఎన్.రఘునాథ్‌రెడ్డి	ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎంబీఎన్‌ఆర్	నారాయణఖేడ్
కె.ఏడుకొండలు	నాగర్‌కర్నూల్	మల్కాజిగిరి
జి.ఏడుకొండలు	కొల్లాపూర్	ఏసీ(డి) హైదరాబాద్–2
పి.రాజ్యలక్ష్మి	జీఎంపీపీ, నారాయణపేట	ఎస్‌వీడబ్ల్యూడీ, మెదక్
జె.నరేందర్‌రెడ్డి	సీపీ– కృష్ణ	యూజీ, నాచారం
ఎండీ ఖలీద్	సీపీ– నందిన్నె	పీసీ, రంగారెడ్డి
బి.కవిత	నారాయణపేట	ఏజీ, సంగారెడ్డి
బి.అంజన్‌కుమార్	హెస్‌హెచ్‌ఓ, షాద్‌నగర్	ఎస్‌హెచ్‌ఓ, నారాయణగూడ
వి.వెంకటేశ్వర్‌రెడ్డి	నల్లగొండ	ఎన్‌ఫోర్స్‌మెంట్, మహబూబ్‌నగర్
జి.శారద	గోల్కొండ	ఎన్‌ఫోర్స్‌మెంట్, మహబూబ్‌నగర్
కె.విప్లవరెడ్డి	నాచారం	జడ్చర్ల
ఎం.అశోక్‌కుమార్	జహీరాబాద్	నారాయణపేట
ఎం.సుబ్రహ్మణ్యం	ఆందోల్	సీపీ– కృష్ణ–1
ఎ.శివజ్యోతి	డీటీఎఫ్, సికింద్రాబాద్	కల్వకుర్తి
బి.అనంతయ్య	తాండూరు	డీటీఎఫ్, నాగర్‌కర్నూల్
ఎ.గణపతిరెడ్డి	ఎన్‌ఫోర్స్‌మెంట్, మహబూబ్‌నగర్	గద్వాల
కె.సైదిరెడ్డి	అమీర్‌పేట్	డీటీఎఫ్, గద్వాల
ఆర్.మొగిలయ్యనాయక్	శంషాబాద్	సీపీ– నందిన్నె– 2
టి.లక్ష్మణ్‌గౌడ్	హయత్‌నగర్	సీపీ– నందిన్నె– 1
కె.కరుణ	డీటీఎఫ్, హైదరాబాద్	కొత్తకోట
ఎస్.రమేష్‌రెడ్డి	ఎన్‌ఫోర్స్‌మెంట్, మెదక్	ఆత్మకూర్

ఎస్‌ఐలకు స్థానచలనం..

ఎస్‌ఐ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
పి.అరుణ్‌కుమార్	దూల్‌పేట్	ఆమనగల్లు
కె.కృష్ణప్రసాద్	సీపీ– జహీరాబాద్	ఆమనగల్లు
జి.సుధాకర్‌రెడ్డి	కొత్తకోట	మహబూబ్‌నగర్
శిరీష	జీఎంపీపీ, జహీరాబాద్	నారాయణపేట
ఎల్.హన్మంతు	మహేశ్వరం	కొల్లాపూర్
డి.దామోదర్	ఎన్‌ఫోర్స్‌మెంట్, హైదరాబాద్	గద్వాల
ఎన్.రమేష్	ముషీరాబాద్	కొత్తకోట
సతీష్‌కుమార్	ఇబ్రహీంపట్నం	ఆత్మకూర్
కేఎం విశ్వనాథం	మెదక్	డీటీఎఫ్, వనపర్తి
బి.శ్రీనివాస్	మహబూబ్‌నగర్	సీపీ– జహీరాబాద్
ఇబ్రహీం రజా	కొల్లాపూర్	జీఎంపీపీ, జహీరాబాద్
బి.యాదయ్య	ఆమనగల్లు	ఎన్‌ఫోర్స్‌మెంట్, మెదక్

తొమ్మిది మంది డీఎస్పీల మార్పు

మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో తొమ్మిది మంది డీఎస్పీలను మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే వనపర్తి ఏఆర్ అదనపు ఎస్పీగా ఎస్.వీరారెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు.

డీఎస్పీ	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
టి.మహేష్	మహబూబ్‌నగర్	డీసీఆర్‌బీ, ఆసిఫాబాద్
కె.కృష్ణకిషోర్	నాగర్‌కర్నూల్	డీజీపీ కార్యాలయం
ఎ.మహేష్	ఏసీపీ, పెద్దపల్లి	డీసీఆర్‌బీ, నారాయణపేట
జె.వెంకటేశ్వర్‌రావు	డీసీఆర్‌బీ, నారాయణపేట	వనపర్తి
ఆనంద్‌రెడ్డి	వనపర్తి	ఇంటెలిజెన్స్
టి.కరుణాకర్	కరీంనగర్ రూరల్	డీసీఆర్‌బీ, వనపర్తి
ఎన్.లింగయ్య	సీఐడీ	నారాయణపేట (సివిల్)
కె.సత్యనారాయణ	నారాయణపేట	గద్వాల
పి.వెంకటేశ్వర్లు	గద్వాల	మహబూబ్‌నగర్ (సివిల్)



క్లుప్తంగా

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని యువకుడు ఆత్మహత్య


సురేష్ (ఫైల్)

కొత్తకోట రూరల్: తాగుడుకు బానిసై క్షణికావేశంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం దొడగుంటపల్లిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం దొడగుంటపల్లి చెందిన అవుల సురేష్(24) కూలీ పనిచేస్తుండేవాడు. కొంత కాలంగా పని చేయకుండా మద్యానికి బానిసయ్యాడు. తనకు డబ్బులు కావాలని లేకుంటే చనిపోతానంటూ కుటుంబ సభ్యులను భయపెట్టేవాడు. సోమవారం రాత్రి సురేష్ తాగివచ్చి తనకు డబ్బులు కావాలని భార్య మణివాణిని, తల్లిని అడుగగా వారు నిరాకరించారు. క్షణికావేశంలో ఇంట్లోకి వెళ్లి ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకున్నాడు. గతంలో మాదిరిగానే భయపెడుతున్నాడులే అనుకుని కుటుంబ సభ్యులు ఊరుకున్నారు. ఎంతకూ బయటకు రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు తలుపు తట్టగా ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. కిందకు తీసి చూసేసరికి అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యతో గొడవపడి భర్త..


శ్రీనివాసులు (ఫైల్)

కోడేరు: భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరులో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కురుమూర్తి తెలిపిన వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన జౌట శ్రీనివాసులు(40) ఆదివారం రాత్రి భార్య కృష్ణవేణితో గొడవ పడ్డాడు. భార్య పిల్లలతో కలిసి పక్కింటికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

అప్పుల బాధతో బలవన్మరణం

నవాబుపేట: ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమ్మపూర్‌నకు చెందిన టంకసాల వెంకట నర్సింహచారీ (27) ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసుకుంటూ జీవించేవాడు. ఇటీవలే అప్పులు చేసి కొత్త ఇల్లు నిర్మించుకున్నాడు. తాజాగా అప్పుల బాధ ఎక్కువైంది. దీంతో మనస్తాపం చెంది ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో తలుపు మూసుకుని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కాగా అతడి తల్లి గీతమ్మ జడ్చర్లకు వెళ్లడంతో ఆలస్యంగా సమాచారం అందింది. ఆమె సోమవారం పోలీసులను ఆశ్రయించారు. అప్పుల బాధతో తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదు చేశారు. ఈమేరకు పోలీసులు కేసునమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

గాయపడిన వ్యక్తి మృతి

కొత్తకోట రూరల్: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలైన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పెద్దమందడి ఎస్‌ఐ శివకుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వనపర్తి కాశీంనగర్‌కు చెందిన ముడావత్ రాజునాయక్ తీవ్రంగా గాయపడిన సంగతి విదితమే. ఈయన చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి భార్య జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బంగారు, నగదు చోరీ

చిన్నంతకుంట: ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లో చోరీకి పాల్పడిన ఘటన పర్దీపురంలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన సాయిసింహారెడ్డి కొంత కాలంగా హైదరాబాద్‌లో నివాసముంటున్నాడు. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చిపోతుంటాడు. ఆదివారం రాత్రి గ్రామంలో ఉన్న తన ఇంటి తాళాలను గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి తులం బంగారం, రూ.10వేల నగదును తీసుకెళ్లారు. సోమవారం ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో గమనించిన చుట్టుపక్కల వారు సాయిసింహారెడ్డికి సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

153 క్వింటాళ్ల నల్ల బెల్లం పట్టివేత

ధరూరు: మండల పరిధిలో 153 క్వింటాళ్ల నల్ల బెల్లం తరలిస్తుండగా సోమవారం పట్టుబడింది. వివరాలు ఇలా ఉన్నాయి.. తమిళనాడు నుంచి ధరూరు మండలం మీదుగా నల్ల బెల్లం తరలిస్తుండగా సమాచారం అందడంతో కొత్తపాలెం స్టేజీ వద్ద సోమవారం సాయంత్రం ఎక్సైజ్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. బెల్లం విలువ రూ.10లక్షలు ఉంటుందని వివరించారు. తమిళనాడు నుంచి 510 బస్తాల్లో సారా తయారీ కోసం దీనిని తరలిస్తుండగా తమకు సమాచారం అందిందన్నారు. బెల్లంతో పాటు వాహనాన్ని గద్వాల ఎక్సైజ్ కార్యాలయానికి తరలించినట్లు ఆబ్కారీ సీఐ గోపాల్ తెలిపారు. బెల్లాన్ని ఉమ్మడి పాలమూరు జిల్లాలోని ఆయా ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు తెలిసిందని వివరించారు. నిందితులు సునీల్ శెట్టి, మోహన్‌రాజుపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

చెంచులకు.. చెలిమె నీరే దిక్కు


మరమ్మతుకు నోచుకోని సోలార్ సిస్టం


తోళ్ల వాగులో చెలిమె తీసి నీటిని తోడుకుంటున్న చెంచులు

నాగరిక సమాజానికి దూరంగా ఉన్న చెంచులు నేటికీ కనీస సౌకర్యాలకు నోచుకోలేకపోతున్నారు. అడవిలో దొరికే దుంపలే పరమాన్నంగా.. వాగు, వంకల నీటినే శుద్ధజలంగా తీసుకుంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఈ క్రమంలో అమ్రాబాద్ పరిధిలోని కొమ్మెనపెంటలో 30 గుడిసెలు ఉండగా.. వంద మంది వరకు జీవిస్తుంటారు. వీరి తాగునీటి సమస్య తీర్చేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో బోరు వేసి సోలార్ సిస్టంతో బిగించారు. అయితే సోలార్ సమస్యతో మోటార్ నడవక మూడు నెలలుగా చెంచులు నీటి కోసం అల్లాడుతున్నారు. కొమ్మెనపెంట సమీపంలోని తోళ్లవాగులో చెలిమె తీసి ఊట నీటిని తాగుతున్నారు. ఈ క్రమంలో సోమవారం చెంచులు చెలిమె నీటిని తీసుకుంటుండగా 'సాక్షి' కెమెరా క్లిక్‌మనిపించింది. - అమ్రాబాద్

ఆధునిక సాగుతో పెట్టుబడి ఆదా

- ఏడీఆర్ మల్లారెడ్డి


మాట్లాడుతున్న ఏడీఆర్ డా. మల్లారెడ్డి

బిజినేపల్లి: ప్రస్తుతం వ్యవసాయ కూలీల ఖర్చు పెరగడమేగాక వారి కొరతను అధిగమించేందుకు రైతులు యాంత్రీకరణ సాగుపై దృష్టి సారించాలని పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ మల్లారెడ్డి అన్నారు. సోమవారం పాలెం కేవీకేలో వ్యవసాయ యంత్రాల విభాగం, హైదరాబాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యవసాయ పరికరాలు, యంత్రాల మేళాలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుతం వ్యవసాయంలో కూలీల కొరతను తగ్గించేందుకు విత్తు విత్తిన నాటి నుంచి పంట కోత వరకు వివిధ దశల్లో అవసరమయ్యే అధునాతన యంత్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. యంత్రాల లభ్యత, పనితీరు, వినియోగం తదితర అంశాలను శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ యంత్రాల ప్రధాన శాస్త్రవేత్త డా. ఎస్.రాజయ్య, వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ పుష్పావతి, కేవీకే కో–ఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జోగుళాంబ బ్రహ్మోత్సవాలు


ఆలయంలో అనిల్‌రావుపుడి, కుటుంబ సభ్యులు


చండీ హోమం నిర్వహిస్తున్న అర్చకులు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ జోగుళాంబ ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం అమ్మవారి యాగశాలలో ఆవాహిత దేవతా హోమాలతో పాటు నిత్య చండీహోమాలు నిర్వహించారు. త్రికాల సమయాలలో ఆలయం చుట్టూ అష్టదిక్పాలకులకు ఉత్సవ బలిభేరి నిర్వహించడంతో పాటు మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మధ్య బలిహరణం సమర్పించారు. జోగుళాంబ మూలమూర్తికి శ్రీసూక్త సహిత ఖడ్గమాల, జంబీర ఫలార్చనలు జరిగాయి. అదేవిధంగా కుంకుమార్చన మండపంలో నిత్య దేవత మూలమంత్ర సహిత పారాయణలు చేశారు. ఇదిలా ఉండగా.. స్వామివారి వారోత్సవాల్లో భాగంగా రథోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, చైర్మన్ చిన్నకృష్ణయ్య పాల్గొన్నారు.

- జోగుళాంబ బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాలను సినీ దర్శకుడు అనిల్ రావుపుడి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. వారికి ఆలయ ఈఓ, ప్రధాన అర్చకులు స్వాగతం పలికారు. ఆలయాల్లో అభిషేకాలు, కుంకుమార్చనలు నిర్వహించారు.

మార్మోగిన అంజన్న నామస్మరణ


స్వామివారి పల్లకీ సేవలో పాల్గొన్న భక్తులు


పుట్టమట్టి తీసేందుకు పూజలు

ధరూరు: మండలంలోని పెద్ద చింతరేవుల ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈసందర్భంగా ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేశారు. ఆలయ ప్రాంగణంలో ధ్వజారోహణంతో ఉత్సవాలకు అంకురార్పణ చేశారు. పండితుల మంత్రోచ్చరణల మధ్య పుట్టమట్టి తేవడంతో పాటు స్వామి వారికి పల్లకీసేవ నిర్వహించారు. ఈసందర్భంగా అంజన్న నామస్మరణ మార్మోగింది. వివిధ ప్రాంతాల నుంచి తరలొచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గిరిరావు, ఈఓ కవిత తదితరులు పాల్గొన్నారు.

కనీస పెన్షన్ పెంపు కోసం ఆందోళన

- జాతీయ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు


దీక్షలో కూర్చున్న ఈపీఎస్ పెన్షనర్లు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ, ప్రభుత్వ రంగసంస్థల విశ్రాంత ఉద్యోగుల కనీస పెన్షన్ పెంచకుంటే ఆందోళనలను ఉధృతం చేస్తామని జాతీయ సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు హెచ్చరించారు. డిమాండ్ల సాధన కోసం ఈపీఎస్ పెన్షనర్లు జిల్లా కేంద్రం టీటీడీ కల్యాణ మండపం ఎదుట సోమవారం ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ నుంచి వస్తున్న కనీస పెన్షన్ రూ.వెయ్యి డీఏతో కలిపి రూ.7,500 పెంచాలని, పెన్షనర్ల భార్య, భర్తలకు ఉచిత వైద్య సౌకర్యం కల్పించాలని కోరుతున్న కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. వెంటనే పెన్షన్ పెంపు కోసం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అబ్దుల్ కరీం, జీబీపాల్, ఉమేష్‌కుమార్, మనోహర్, నాగాంజనేయులు తదితరులు ప్రసంగించారు. దీక్షకు సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్ష, కార్యదర్శులు జగపతిరావు, నస్కంటి నాగభూషణం మద్దతు ప్రకటించారు. దీక్షలో సుల్తాన్, బషీరుద్దీన్, బుచ్చన్న, బీవీ.నారాయణ, భీమయ్య, రాంచందర్, కేఎల్.డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

రెండు దుకాణాల్లో చోరీ


ధ్వంసం చేసిన దుకాణం రేకులు

కోస్గి: పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న రెండు వేర్వేరు దుకాణాల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం .. తాండూర్ రోడ్డులో బాల్ రాజ్ హోల్‌సెల్ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దుకాణం పక్క నుంచి షెడ్డును ధ్వంసం చేసి చొరబడ్డారు. దుకాణంలో ఉన్న రూ.1.07 లక్షల విలువైన సిగరెట్ బాక్సులతో పాటు రూ.4వేలకు పైగా నగదు ఎత్తుకెళ్లారు. ఇదే క్రమంలో నారాయణపేట రోడ్డులో ఉన్న శ్రీహరికి చెందిన వెంకటేశ్వర కిరాణంలో షటర్ తాళం పగులగొట్టి రూ.20వేల విలువైన సిగరెట్ బాక్సులు, రూ.7వేలకు పైగా నగదు ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఎప్పటిలాగే దుకాణాలు తెరిచేందుకు వచ్చిన యజమానులు చోరీ జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. పట్టణ ప్రధాన రోడ్డులో ఉన్న దుకాణాల్లో చోరీలు కావడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పూర్తిస్థాయి నీటిమట్టం

మదనాపురం: మండలంలోని రామన్‌పాడు జలాశయంలో సోమవారం పూర్తిస్థాయి నీటిమట్టం 1,021 అడుగులు ఉన్నట్లు ప్రాజెక్టు ఏఈ సింగిరెడ్డి రజనీల్‌రెడ్డి తెలిపారు. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,140, సమాంతర కాల్వ నుంచి 150 క్యూసెక్కుల వరద వస్తుండగా.. ఎన్టీఆర్ కాల్వకు 1,050 క్యూసెక్కులు, తాగునీటి అవసరాలకు 20 క్యూసెక్కులు వినియోగిస్తున్నామని వివరించారు.

వీరజవాన్ భార్యకు ప్రభుత్వ ఉద్యోగం

వంగూరు: మండలంలోని కొండారెడ్డిపల్లికి చెందిన సైనికుడు యాదయ్య పదేళ్ల కిందట జరిగిన యుద్ధంలో మృతిచెందాడు. ఆయన భార్య సుమతమ్మను రెవెన్యూశాఖలో జూనియర్ అసిస్టెంట్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామానికి చెందిన సుమతమ్మకు పదేళ్ల తర్వాత ఉద్యోగం రావడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం జెడ్పీటీసీ సభ్యుడు కేవీఎన్ రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో వీరజవాన్ యాదయ్య కుటుంబానికి అన్యాయం జరిగిందని, కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే భార్యకు ఉద్యోగం ఇవ్వడంతో పాటు రూ.10 లక్షలతో యాదయ్య పేరుతో గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు వేమారెడ్డి, మురళి, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

చూస్తుండగానే రూ.లక్ష మాయం

- ఆర్టీసీ బస్సు దిగుతుండగా జారి పడిన నగదు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బస్సు దిగుతుండగా ఓ ప్రయాణికుడి బ్యాగు నుంచి సోమవారం రూ. లక్ష నోట్ల కట్ట కింద పడింది. బస్సు ముందరి టైరు వద్ద పడటం, అటువైపు నుంచి వస్తున్న ఓ మహిళ గమనించిన వాటిని తీసుకెళ్లింది. డబ్బులు పడిపోయావని గ్రహించిన ప్రయాణికుడు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బస్టాండ్ ప్రాంతంలోని సీసీ కెమెరాల ద్వారా రికార్డయిన పుటేజీని పోలీసులు పరిశీలించారు. మహిళ డబ్బులు తీసుకుని వెళ్లినట్లు గుర్తించారు. ఆ మహిళ కోసం పోలీసులు గాలిస్తున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రాములు తెలిపారు.

నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

ధన్వాడ: దివ్యాంగురాలిపై అత్యాచారం ఘటన కేసులో నిందితుడు కావలి కరుణాకర్‌కు నారాయణపేట జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి మహ్మద్ అబ్దుల్ రఫీ యావజ్జీవ కఠిన కారాగార శిక్షతో పాటు రూ.51,500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. 2018లో మండల కేంద్రానికి చెందిన దివ్యాంగురాలిపై అదే గ్రామానికి చెందిన కావలి కరుణాకర్ పలుమార్లు అత్యాచారం చేయడంతో గర్భం దాల్చింది. దీంతో ఆమె సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ కృష్ణయ్య కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ శ్రీకాంత్‌రెడ్డి విచారణ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప, అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మురళీకృష్ణ తమ వాదనలు వినిపించారు. మరికల్ సీఐ ఎస్.రాజేందర్, ధన్వాడ ఎస్‌ఐ రమేష్ అవసరమైన 12 మంది సాక్ష్యులను కోర్టులో హాజరుపర్చారు. వాదనలు విన్న న్యాయమూర్తి సోమవారం తుది తీర్పు వెలువరించారు. ఈ సందర్భంగా సిబ్బందిని ఎస్పీ యోగేష్ గౌతమ్ అభినందించారు.

కుక్కల దాడిలో 42 గొర్రె పిల్లలు మృతి

ఉండవెల్లి: మండలంలోని కంచుపాడులో ఆంజనేయులుకు చెందిన 42 గొర్రె పిల్లలు సోమవారం కుక్కల దాడిలో మృతి చెందాయి. కంచుపాడు గ్రామంలో వనపర్తి జిల్లా కాశీపురం గ్రామానికి చెందిన ఆంజనేయులు గొర్లను మేత కోసం స్థావరం ఏర్పాటు చేసుకున్నాడు. తెల్లవారుజామున గొర్రెలను మేపడానికి వెళ్లిన క్రమంలో ఒక చోట గొర్రె పిల్లలను కంచెలో ఉంచారు. కుక్కలు కంచెలోకి వెళ్లి దాడి చేసి చంపేసినట్లు తెలిపారు. దాదాపు రూ.2లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.



షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెలు దగ్ధం


పూర్తిగా కాలిబూడిదైన నివాస గుడిసె


పశుగ్రాసం మంటలను ఆర్పుతున్న రైతులు

పాన్‌గల్: షార్ట్ సర్క్యూట్‌తో నివాస గుడిసెలు దగ్ధమైన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. మండలంలోని మాందాపూర్‌లోని బీసీ ప్లాట్లలో నివాసం ఉంటున్న సాయికి చెందిన నివాస గుడిసెలో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. గుడిసెలోని బియ్యం, దుస్తులు, వంట సామగ్రి, టీవీ, బీరువా, రూ.10 వేల నగదు కలిపి దాదాపుగా రూ.2.20 లక్షలు దగ్ధమైంది. ఈ గుడిసె నిప్పులు పక్కనే ఉన్న మండ్ల ఎల్లస్వామి గుడిసెకు వ్యాపించి గుడిసెలోని ఫ్యాన్, తలుపులు, సామగ్రి దగ్ధమైంది. వీటి విలువ దాదాపుగా రూ.20 వేల వరకు ఉంటుందన్నారు. గుడిసెల దగ్ధం విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే వారు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు పక్క గుడిసెలకు వ్యాపించకుండా నిరోధించారు. గుడిసెల్లో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆర్‌ఐ మహేష్ సంఘటన స్థలానికి చేరుకొని పూర్తి వివరాలను సేకరించి అంచనా విలువను అధికారులకు నివేదిస్తామన్నారు. ప్రభుత్వ పరంగా అన్ని విధాలుగా ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

దావాజిపల్లిలో వేరుశనగ పొట్టు, వరిగడ్డి దగ్ధం..

మండలంలోని దావాజిపల్లిలో షార్ట్ సర్క్యూట్‌తో వేరుశనగ పొట్టు, వరి గడ్డి దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు మన్నెమయ్యకు చెందిన ట్రాక్టర్ వేరుశనగ పొట్టు, కృష్ణయ్య అనే రైతుకు చెందిన రెండు ట్రాక్టర్ల వరి గడ్డిని సమీపంలోని పంట పొలాల్లో నిల్వ చేసుకున్నారు. పశుగ్రాసం నిల్వ చేసుకున్న సమీపంలోనే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తాకి మంటల మిరుగులు పశుగ్రాసంపై పడి మంటలు వ్యాపించాయి. సమీపంలో ఉన్న రైతులు అప్రమత్తమై పక్కనే ఉన్న బోరు నీటితో మంటలు అదుపు చేశారు. వీటి విలువ రూ.15 వేల వరకు ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ పరంగా సాయం చేసి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సోలార్ ప్లాంట్‌లో అగ్ని ప్రమాదం

అచ్చంపేట రూరల్: మండలంలోని లక్ష్మాపూర్ సమీపంలో ఉన్న రుద్ర సోలార్ ప్లాంట్‌లో సోమవారం ప్రమాదవశాత్తు మంటలు చెలరేగాయి. గుర్తించిన సిబ్బంది 101కు కాల్‌చేయగా అచ్చంపేట నుంచి ఫైరింజన్ వచ్చి మంటలు అదుపు చేసింది. అప్పటికే ప్లాంట్‌లోని కేబుల్స్, మాడ్యూల్స్, వివిధ విలువైన సామగ్రి కాలి బూడిదైంది. షార్ట్ సర్క్యూట్‌తోనే ప్రమాదం జరిగి ఉండవచ్చని.. రూ.10 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు సోలార్ ప్లాంట్ నిర్వాహకులు తెలిపారు.



పార్లమెంట్ ఎన్నికల్లో సత్తాచాటుదాం


మాట్లాడుతున్న నిరంజన్‌రెడ్డి

కల్వకుర్తి: అసత్యపు ప్రచారాలు, అబద్ధపు మాటలు, మోసపూరిత ప్రకటనలతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని రాష్ట్ర మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అధ్యక్షతన నియోజకవర్గ స్థాయి బీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కసిగా ప్రచారం నిర్వహించి విజయం సాధిద్దామన్నారు. ఓటమికి ప్రధానంగా నూతన ఓటర్లు, నిరుద్యోగ యువత, ఉద్యోగులు కారణంగా తేల్చారు. పాలమూరు నుంచి ఎన్నికైన ముఖ్యమంత్రులతో ఈ ప్రాంతానికి అన్యాయమే జరిగిందన్నారు. గతంలో బూర్గుల రామకృష్ణారావు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తెలంగాణను తీసుకెళ్లి ఆంధ్రలో విలీనం చేశారని, ఇప్పుడు పాలమూరు నుంచి రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక కృష్ణానదిపై ఉన్న ప్రాజెక్టులను కేంద్రం చేతిలో పెట్టి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు. కృష్ణానది జలాలపై హక్కులు మనకే ఉండాలనే ఉద్దేశంతో ఈ నెల 13న నల్లగొండలో నిర్వహించే బహిరంగ సభ ద్వారా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు గువ్వల బాలరాజు మాట్లాడుతూ.. అసత్య ప్రచారాన్ని కార్యకర్తలు నమ్మవద్దన్నారు. ప్రభుత్వంపై వ్యతిరేఖతకు కల్వకుర్తి, అచ్చంపేట మార్కెట్ యార్డుల్లో రైతులు చేసిన ఆందోళన చిహ్నంగా భావించాలన్నారు. కార్యకర్తలకు అండగా ఉంటానని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ మాట్లాడుతూ.. పదవులపై మమకారం లేదని, పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఆదేశాలు శిరసావహిస్తూ.. కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు.

కార్యకర్తల ఆక్రోశం..

పార్టీ ఓటమిపై కార్యకర్తలు తమ ఆవేదన, ఆక్రోశం వెల్లగక్కారు. నాయకత్వం సరైన రీతిలో వ్యవహరించకపోవడమే ఓటమికి ప్రధాన కారణమన్నారు. గెలుపు కోసం కృషి చేసిన కార్యకర్తలకు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో సమస్యలు వచ్చాయన్నారు. ఇప్పుడు అధికార పార్టీ నాయకులు తమను బెదిరిస్తున్నారని, తమకు అండగా ఉండే వారు ఎవరని ప్రశ్నించారు. అండగా ఉండకుంటే తమ దారి తాము చూసుకుంటామన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఉన్న నాయకులు ఇప్పుడు ఎక్కడికి వెళ్లారని, వారికే విలువ ఇచ్చి పనిచేసే కార్యకర్తలను ఎందుకు పట్టించుకోలేదని నిలదీసినంత పనిచేశారు.

సామాన్యుడి పోరాటంపై శాసన సభలో ప్రస్తావన


శ్రీనివాస్‌ను అభినందిస్తున్న స్థానిక రైతులు

దామరగిద్ద: దక్షిణ తెలంగాణ వరప్రదాయిని కృష్ణా జలాల అక్రమ తరలింపుపై ఓ సాధారణ వ్యక్తి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించిన విషయంపై సోమవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో ప్రస్తావనకు వచ్చింది. నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం బాపన్‌పల్లికి చెందిన గవినోళ్ల శ్రీనివాస్ గతేడాది హైకోర్టు ద్వారా నేషనల్ గ్రీన్ ట్రిబునల్‌ను ఆశ్రయించి, కృష్ణాజలాల అక్రమ తరలింపును అడ్డుకున్నారని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. ఓ సామాన్యుడు నదీజలాలపై పోరాటం చేస్తే, అప్పటి ప్రభుత్వం ఏం చేసిందని ప్రశ్నించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ కృషిని ప్రభుతం గుర్తించడం అభినందనీయమని స్థానిక రైతులు శంకర్‌గౌడ్, సుభాష్, రాంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగయ్యస్వామి, అశోక్ హర్షం వ్యక్తంచేశారు.

అగ్నివీర్‌గా ఎస్సీ హాస్టల్ విద్యార్థిని ఎంపిక



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఇటీవల ప్రభుత్వం చేపట్టిన అగ్నివీర్ మహిళా మిలిటరీ పోలీస్ నియామకాల్లో మహబూబ్‌నగర్‌లోని ఎస్సీ హాస్టల్ డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థిని ఎం.సునీత ఎంపికయ్యారు. ఈ మేరకు తెలంగాణ రాష్ట్రం నుంచి మొత్తం ఐదుగురు విద్యార్థినులు ఎంపిక కాగా అందులో సునీత ఒకరు. ఎంపిక అగ్నివీర్‌గా ఎంపికైన ఆమెను జిల్లా ఎస్సీ సంక్షేమశాఖ అధికారి పాండు, వసతి గృహ సంక్షేమ అధికారి స్వప్నప్రియ అభినందించారు.

రోడ్డుపైకి చిరుత.. హడలెత్తిన వాహనదారులు

ఖిల్లాఘనపురం: మండలంలో చిరుత పులి భయానికి ప్రజలు బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. సోమవారం ఖిల్లాఘనపురం మండల కేంద్రం నుంచి వనపర్తి జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి దాటుతూ చిరుత కనిపించడంతో అటుగా వెళ్తున్న కొందరు వాహనదారులు భయంతో వణికిపోయారు. ఖిల్లాఘనపురం డాక్టర్ నరేందర్‌బాబు, సోళీపురం గ్రామానికి చెందిన నందకిశోర్, అల్లమాయపల్లి గ్రామానికి చెందిన యుగేందర్‌లు సోమవారం రాత్రి 7:30 గంటల సమయంలో వనపర్తి నుంచి ఖిల్లాఘనపురానికి కారులో వస్తున్నారు. గ్రామ సమీపంలో ఆకుల సత్యనారాయణ వ్యవసాయ పొలం (కొత్త రైస్‌మిల్) దగ్గరకు రాగానే పెద్దగుట్ట వైపు నుంచి రోడ్డు దాటుతూ చిరుత కనిపించింది. రోడ్డుపై నెమ్మదిగా భయం లేకుండా వెళ్తుతుండటంతో వారు కారు ఆపి అద్దాలు బిగించుకుని భయంతో కూర్చున్నారు. కొంత సేపటి చిరుత వెళ్లాక ఖిల్లాఘనపురం చేరుకుని చిరుత విషయాన్ని చెప్పారు. చిరుత భయానికి మండలంలో ప్రజలు రాత్రి కాకముందే ఇండ్లకు చేరుకుంటున్నారు. చిరుతను ఎలాగైన ఫారెస్టు అధికారులు పట్టుకుని తీసుకెళ్లాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

DOCUMENT MISSING

- మా నాన్న గారు అయిన పల్లె యాదగిరి గౌడ్ తండ్రి పల్లె భీమయ్య గౌడ్, వయస్సు 58 సం॥లు R/o ఇ.నం 2-21, కొప్పెట గ్రా॥, భూత్పూర్ మం॥, మహబూబ్‌నగర్ జిల్లా - 509382 అనే నా యొక్క ప్లాట్ డాక్యుమెంట్స్ నం. 2440/2010 మరియు 977/2011. కొప్పెట నుండి మక్తల్ వెళ్లి తిరిగి వస్తుండగా 17/01/24 నాడు మక్తల్‌లో నా యొక్క ప్లాట్ ఒరిజినల్ డాక్యుమెంట్స్ పోయినవి. కావున ఎవరికైనా దొరికినచో ఈ నంబర్‌కి ఫోన్ చేయగలరు. సెల్:8179905145.

WANTED

- డైరెక్ట్ జాబ్ 18-30 సం॥ మహిళలు / పురుషులు మా కంపెనీ కొరకు వెంటనే కావలెను. ఫ్రీ రూం+ భోజనం+డ్రైవర్లు+మార్కెటింగ్ స్టాఫ్ కావలెను. జీతం 20,000/-. ఫోన్: 8886733005.
- హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+ భోజనం. జీ: 18K. Ph: 9640258899, 9640468899

గమనిక

- సాక్షి మేనేజ్‌మెంట్